క్లుప్తంగా

తాటిచెట్లపాలెంలో అన్నసంతర్పణ



అన్నప్రసాదం వడ్డిస్తున్న బొడ్డేటి గంగామహేష్, కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు గవర తాటిచెట్లపాలెంలోని హనుమాన్ సీతారామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆదివారం అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బొడ్డేటి గంగామహేష్ ప్రారంభిచారు. అధిక సంఖ్యలో భక్తులు, స్థానికులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ద్వారం సంతోష్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ గౌరవాధ్యక్షులు సదరం నూకరాజు, సదరం ఆంజనేయులు, గౌరీశంకర్, మారుతి వెంకట అప్పారావు, వేగి శ్రీను, సదరం గోవింద, సదరం శ్రీను, సదరం కిరణ్, సంజీవరావు, ఫణికుమార్, మహిళలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన కారును పొక్లెయిన్‌తో బయటకు తీస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో శనివారం రాత్రి ఓ కారు ప్రమాదానికి గురైంది. వివరాలిలా.. ఏపీ31 సీఆర్ 5175 నంబర్ గల కారులో దంపతులు శనివారం రాత్రి సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ ఎస్ఎఫ్ఎస్ స్కూల్ నుంచి బాలయ్యశాస్త్రి లేఅవుట్ వైపు వచ్చారు. అక్కడ పండ్లు కొనేందుకు భార్య దిగగా.. భర్త కారులోనే ఉన్నారు. ఒక్కసారిగా కారు పక్కనే ఉన్న శ్రీప్రకాష్ స్కూల్(పాతది)లోకి దూసుకుపోయింది. కారులో ఉన్న ఆయన నుదిటిపై చిన్నపాటి గాయమైంది. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు కారును పొక్లెయిన్‌తో బయటకు తీశారు. పెద్ద ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సమ్మర్ క్యాంప్ ప్రారంభం



సమ్మర్ క్యాంప్‌లో చిన్నారుల కేరింతలు

కంచరపాలెం: స్థానిక రవీంద్రనగర్‌లోని బీఎస్ఆర్ ఫౌండేషన్‌లో ఆసరా చారిటబుల్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సమ్మర్ క్యాంప్‌ను సంస్థ కన్వీనర్ కె.సుశీల ప్రారంభించారు. సెల్ఫ్ డిఫెన్స్, చిత్రలేఖనం, పుస్తక పఠనం, చేతిరాత, చెస్, డ్యాన్స్, క్రాఫ్ట్, స్కిట్ తదితర అంశాలపై 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందని నిర్వాహకుడు శ్రీనాథ్ తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. తొలి రోజు సమ్మర్ క్యాంప్‌లో చిన్నారులు ఉత్సాహంగా స్కిట్లు ప్రదర్శించి కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో జోన్ సభ్యులు అప్పారావు, కృష్ణారావు, పుష్ప, మణి, కల్యాణి, భవాని, వసంత, హారిక, నిఖిల, శ్రావ్య, మౌనిక, ఉషశ్రీ, స్వర్ణ, తులసి, దీక్షితా, లక్ష్మీప్రియా, ప్రణతి, మాన్యా, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్యం చేస్తున్న విద్యార్థులు

అల్లిపురం: బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం జిల్లా బాలభవన్ విద్యార్థుల కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఆచార్యులు లలిత ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యం తిలకించిన వారంతా భక్తిపారవశ్యంతో తరించారు.



సీతంపేట నుంచి పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్



44వ వార్డు నుంచి ర్యాలీగా వస్తున్న కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు



అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ కూడలిలో జన సందడి

జన నీరాజనం

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం బస్సు యాత్ర ద్వారా ఆదివారం విశాఖకు విచ్చేసిన జన హృదయ నేత, సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉత్తర నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఆధ్వర్యంలో తమ ప్రియతమ నేత జగనన్నను చూసేందుకు జనం పోటెత్తారు. దారి పొడవునా నీరాజనాలు పలుకుతూ సీఎం బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టారు.



జగన్ మావయ్య అంటూ.. ప్లకార్డు ప్రదర్శిస్తున్న చిన్నారి

- సీఎం జగన్ బస్సు యాత్రకు 'ఉత్తర'లో అపూర్వ స్వాగతం
- జననేతను చూసేందుకు పోటెత్తిన ప్రజలు, అభిమానులు

సీతంపేట/కొమ్మాది: సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కనులారా చూసి ప్రజలు ఉప్పొంగిపోయారు. ఉత్తర నియోజకవర్గంలోని 53వ వార్డు మొదలుకుని మర్రిపాలెం మీదుగా ఆదివారం మేమంతా సిద్ధం బస్సు యాత్ర కొనసాగింది. పెద్ద ఎత్తున ప్రజలు, యువత, చిన్నారులు, అభిమానులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని వార్డుల నుంచి జనం మధ్యాహ్నం 2 గంటల నుంచి అక్కయ్యపాలెం మహారాణి పార్లర్, పోర్టు ఆస్పత్రి కూడలి, హైవే రోడ్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ కూడలి, గురుద్వారా కూడలి, సత్యం జంక్షన్ ఇలా ప్రతి చోటా వేల సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం కంచరపాలెం మెట్టు వద్ద ప్రారంభమైన బస్సు యాత్ర తాటిచెట్లపాలెం, దొండపర్తి, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, మహారాణి పార్లర్ కూడలి, పోర్టు స్టేడియం కూడలి, గురుద్వారా, సత్యం జంక్షన్‌ల మీదుగా తూర్పు నియోజకవర్గంలోకి ప్రవేశించింది.

జనసంద్రం.. సాంస్కృతిక సంబరం

అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ కూడలి వద్దకు సాయంత్రం వచ్చిన బస్సు యాత్రలో జగనన్నను చూసేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు వేలాదిగా తరలిరావడంతో జనసంద్రంగా మారింది. ఎటు చూసినా పార్టీ జెండాలు, బెలూన్‌లు రెపరెలాడాయి. తీన్‌మార్ డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి నెలకొంది. పోర్టు స్టేడియం కూడలి వద్ద పెద్ద సంఖ్యలో మహిళలు కలశాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సీఎంకు ఘన స్వాగతం పలికారు,. గుమ్మడికాయలతో దిష్టి తీశారు. తీన్‌మార్, కేరళ వాయిద్యాల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.





బస్సు యాత్రలో పోర్టు స్టేడియం వద్ద నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ

వార్డుల నుంచి ఉత్సాహంగా..

జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బాణాల తరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో 44వ వార్డు నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు రామచంద్రానగర్ ఆర్చి నుంచి ర్యాలీగా మహారాణి పార్లర్ కూడలికి చేరుకున్నారు.

- 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో సీతంపేట దుర్గాగణపతి ఆలయం నుంచి అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ వరకు పార్టీ శ్రేణులు ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, సచివాలయ కన్వీనర్లు సానబోయిన సురేష్, వెంపటాపు నూకరాజు, పద్మ, సంధ్య, వీరమ్మ, హరికృష్ణ, గోవిందమ్మ, శేఖర్, లక్ష్మణకుమార్, బొమ్మాళి రవి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.
- 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా ఆటోలు, వ్యాన్‌ల్లో తరలివచ్చారు.

అడుగడుగునా ఘన స్వాగతం

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం నుంచి రైల్వే స్టేషన్ రోడ్డులో రైల్వే న్యూకాలనీ మీదుగా సాగిన బస్సు యాత్రలో ముఖ్యమంత్రి జగన్‌కు అడుగడుగునా ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. రైల్వే న్యూ కాలనీ వద్ద వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ ఆధ్వర్యంలో బొడ్డేటి గంగామహేష్, దువ్వలపూడి శ్రీనివాసరావు, ఆళ్ల గోపి నేతృత్వంలో ప్రజలు, మహిళలు ఆశీర్వాద్ కల్యాణ మండపం, తాటిచెట్లపాలెం బస్‌స్టాప్ వద్ద.. 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైల్వే న్యూకాలనీ వద్ద, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోకు, వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో మహారాణి పార్లర్ వద్ద సీఎంకు స్వాగతం పలికారు.

మార్మోగిన జై జగన్ నినాదం

మర్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు 53వ వార్డు ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి చేరుకున్నారు. జై జగన్ అంటూ మళ్లీ సీఎం జగనే అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఈద్గా విషయమై వినతి

జీవీఎంసీ 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలు ఈద్గా విషయమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించడానికి సిద్ధపడ్డారు. ఆ వినతిపత్రాన్ని తీసుకుని బర్కత్ అలీని బస్సులో తన వెంట రమ్మని సీఎం జగన్ పిలిచారు.



మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



మహారాణి పార్లర్ వద్ద డ్యాన్స్ జోష్‌లో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ



ఊర్వశి జంక్షన్‌లో 48వ వార్డుకు చెందిన అభిమానుల సందడి

కంచరపాలెం మెట్టులో జన జాతర

కంచరపాలెం: కంచరపాలెం మెట్టు కూడలిలో సీఎం వైఎస్ జగన్‌కు జనం జేజేలు పలికారు. 46, 47, 48, 54, 55 వార్డుల ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముఖ్యమంత్రిని చూసేందుకు భారీగా తరలివచ్చారు. 104 ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఐటీఐ జంక్షన్, ఊర్వశి కూడలి, కంచరపాలెం ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి వేచి ఉండి జగనన్నను చూసి సంబరపడ్డారు. కంచరపాలెం మెట్టు నేతాజీ వంతెన కూడలికి సాయంత్రం 6 గంటలకు సీఎం బస్సు యాత్ర చేరుకోవడంతో అభిమానులు, ప్రజల కేరింతలతో బీఆర్‌టీఎస్ రహదారులు దద్దరిల్లాయి. వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఫొటో ప్లకార్డులతో సీఎం జగన్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు చల్లా రజిని, కె.వి.ఎన్.శశికళ, కె.కామేశ్వరి, పార్టీ వార్డు అధ్యక్షులు కాయిత రత్నాకర్, చల్లా ఈశ్వరరావు, నీలి రవి, సీనియర్ నాయకులు కర్రి రామారెడ్డి, బొగ్గు శ్రీను, చిర్లా సత్యనారాయణ, డి.శ్రీనివాసరావు, బాకీ శ్యామ్‌కుమార్ రెడ్డి, వసంతల అప్పారావు, సిద్ధార్థ, కె.విజయ్, కరుణ, తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లో నిరీక్షిస్తున్న అభిమానులు



జగనన్న కోసం ఎదురుచూస్తున్న మహిళలు



కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో జగనన్న కోసం ఎదురుచూస్తున్న ప్రజలు, అభిమానులు

దేవుడిని చూడాలని వచ్చా..



నా వయసు పైబడటంతో పింఛన్ సొమ్ము కోసం తిరిగే ఓపిక లేదు. నెలనెలా ఠంఛన్‌గా ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులు చేతిలో పెట్టి నాలాంటి వారికి జగన్ బాబు చాలా మేలు చేశాడు. రక్త సంబంధీకులు కూడా పట్టించుకోని ఈ రోజుల్లో ఎంతో మందికి పింఛన్ అందిస్తున్న దేవుడు జగన్. నా దేవుడిని చూడాలని ఓపిక కూడగట్టుకుని వచ్చాను.

– ఒమ్మి లక్ష్మమ్మ, సీతంపేట

పింఛన్ డబ్బులే ఆధారం



వృద్ధాప్యంలో ఎవరి దయా దాక్షిణ్యాలపై ఆధార పడకుండా బతికేలా జగన్ బాబు నెలనెలా రూ.3 వేలు పింఛన్ ఇస్తున్నాడు. రేషన్ వస్తుంది. పింఛన్ డబ్బులతో మందులు, ఇంటి ఖర్చులు వెళ్లిపోతున్నాయి. ఎవరినీ సాయం అడగక్కర లేదు. నాలాంటి వృద్ధుల ఆశీస్సులు జగన్ బాబుకు ఉంటాయి. మళ్లీ ముఖ్యమంత్రి అవుతాడు. పింఛన్ పెంచుతాడు.

–జామి అమ్మాజి, గణేష్‌నగర్

జగన్ బాబును చూసేందుకు..



టీడీపీ నాయకుల దాడిలో గాయపడ్డ సీఎం జగన్ బాబును చూసేందుకు వచ్చాను. అడగకుండానే ప్రజల కష్టాలు తీరుస్తున్న నాయకుడు. అలాంటి నాయకుడిపై దాడి చేసిన వారు మట్టికొట్టుకుని పోతారు. నాకు పింఛన్ ద్వారా అన్నం పెడుతున్న దేవుడు జగన్ బాబు. ఒక్కసారి దగ్గర నుంచి జగన్ బాబు చూస్తే అదే చాలు.

– బి.అచ్చయమ్మ, సీతంపేట

సీఎం జగన్ వల్లే బాగున్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బాబు ప్రవేశపెడుతున్న పథకాల వల్లే మూడు పూటలు అన్నం తింటున్నాం. మాలాంటి వృద్ధులను ఓ మనవడిలా చూసుకుంటున్నాడు. మళ్లీ జగన్ బాబు ముఖ్యమంత్రి కావాలి. ఆయనను చూస్తుంటే అచ్చం రాజశేఖరరెడ్డిని చూసినట్లే ఉంది. జగన్ బాబునే మళ్లీ గెలిపించుకుంటాం.

– భీశెట్టి సూర్యతల్లి, అక్కయ్యపాలెం

మా ఓటు జగనన్నకే..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూడాలని ఉదయం నుంచి వేచి చూస్తున్నాను. మాకు వైఎస్సార్ భరోసాతోపాటు మా మనవడికి అమ్మ ఒడి పథకంతో లబ్ధి పొందాం. జగన్ పాలనలో ఎందరికో మేలు జరిగింది. ఈ ఎన్నికల్లో మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తాం. జగన్ వస్తేనే పేదల బతుకులు బాగుంటాయి.

– రావాడ వీరమ్మ, సీతంపేట

విజయవంతంగా చిత్రలేఖన పోటీలు

మర్రిపాలెం: ధరిత్రి దినోత్సవం సందర్భంగా చిత్రలేఖన పోటీలు విజయవంతంగా జరిగాయని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పి.వి.ముకుందరావు తెలిపారు. మాధవధార వుడా కాలనీలోని పీసీబీ కార్యాలయంలో ఆదివారం ఎకో వైజాగ్‌లో భాగంగా ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ అనే థీమ్‌తో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముకుంద మాట్లాడుతూ చిన్నారులు ఆసక్తిగా పాల్గొన్నారని, ముఖ్యంగా అమ్మాయిలు ఎక్కువగా పాల్గొనడం విశేషమన్నారు. ఈ కార్యక్రమ జడ్జి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎన్విరాన్మెంట్ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ ఇ.యు.బి. రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ స్పృహను పెంపొందించేందుకు మరిన్ని ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, యాక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధి కృష్ణకుమారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.



గీసిన పెయింటింగ్స్ చూపుతున్న చిన్నారులు

ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు

మహారాణిపేట : పలు ప్రభుత్వ శాఖలకు చెందిన సంక్షేమ వసతి గృహాలకు మౌలిక సదుపాయాలు కల్పించారు. తొమ్మిది సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, 5 వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహాలు, ఒక గిరిజన సంక్షేమ వసతి గృహానికి రూ.5 కోట్ల 63 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు 18 నెలల్లో అధికారులు ఈ పనులు పూర్తి చేశారు. ఆధునికీకరించిన వసతి గృహాల్లో మొత్తం 1950 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. విశాఖ విద్యా వసతి వికాసంలో భాగంగా ఆదివారం 250 మంది విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా మూడు ప్రభుత్వ వసతి గృహాల పనులు చేపట్టారు.

పచ్చదనం పెంపునకు చర్యలు

మురళీనగర్: వాకర్స్ పార్కులో పచ్చదనం పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. వాకర్స్ పార్కులో నిర్వహించిన క్లబ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలలో సభ్యత్వ నమోదుకు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో నూతన సభ్యులు చేరడం వల్ల రూ.1 లక్షలు మూలనిధికి జమ చేశామని, తద్వారా మూలనిధి రూ.13 లక్షలకు చేరిందని చెప్పారు. మూలనిధి పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు సభ్యులు సహకరించాలని కోరారు. ఈ వేసవిలో విద్యార్థులకు ఉపయోగపడేలా ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 24 నుంచి చెస్ క్రీడలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి జె.కూర్మారావు, టి.వి.రమణ, పూర్వాధ్యక్షులు ఎస్.బుచ్చయ్య ,ఆర్.సత్యనాథం, ఎం.భాస్కరరావు, కేజీ కృష్ణారావు, కె.ద్వారకానాథ్, ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు, ఎం.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, బోర్డు సభ్యులు విజయలక్ష్మి, వి.అప్పారావు, ఎస్.రామ్మోహన్‌రావు, ఎస్.శ్రీనివాసరావు, వై.దేముడు, పి.శ్రీనివాస రావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను స్వాగతిస్తూ భారీ బైక్ ర్యాలీ



వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నుంచి బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న సంపంగి శ్రీనివాసరావు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలోకి ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ప్రవేశించిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపు మేరకు యువజన విభాగం ఆధ్వర్యంలో సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ సంపంగి శ్రీనివాసరావు, అంబటి శైలేష్, సంబాల రాజేష్‌కుమార్ నేతృత్వంలో ఉత్తర పార్టీ కార్యాలయం వద్ద నుంచి 300 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్, ఫోర్త్‌టౌన్ సిగ్నల్, సీతంపేట, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం హైవే, కంచరపాలెం మెట్టు ముత్యాలమ్మ గుడి, మహారాణి పార్లర్, అక్కయ్యపాలెం జంక్షన్, ఎన్‌హెచ్–5 జంక్షన్, గురుద్వారా జంక్షన్‌ల మీదుగా సత్యం జంక్షన్ వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర విజయవంతంగా సాగిందని, ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా జగనన్న, ఉత్తర ఎమ్మెల్యేగా కె.కె.రాజు అత్యధిక మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. బైక్ ర్యాలీలో భారీగా అభిమానులు పాల్గొన్నారు.